# ఆదర్శం

చిన్న కథ

రచన :
"పాప"

"సిగరెట్ కావాలిరా?" అన్నాడు గోపాలం.

"నేనీ మధ్య చుట్టలు మొదలు పెట్టానురా" అన్నాడు సీతారామం.

గోపాలం సిగరెట్ ముట్టించాడు. ఆ అగ్గిపుల్లతోనే సీతారామం చుట్ట ముట్టించాడు. కాలవ ముప్ఫయి గజాల వెడల్పుని నిండుగా ప్రవహిస్తోంది. దూరంగా దృష్టి ఆనేటంతవరకూ ఇరు గట్లనీ కొబ్బరిచెట్ల వరస సాగివెడుతోంది. కాలవ అడుగుని మాయలోకంలో చెట్ల ప్రతిబింబాలు తల్లక్రిందుగా మరీ క్రింద ఉన్న ఆకాశపు మబ్బుల్ని ముట్టుకుంటున్నాయి. రెండు ఫర్లాంగుల దూరంలో కాలవ దిగువని ఎత్తైన వంతెన ఉంది. ఆ వంతెన దాటి కాలవ ఇంకో యుగంలోకి పోతున్నట్టుంది.

"మా ఊరు రావడం ఇదే మొదటిసారి కదూ?" అన్నాడు గోపాలం. సీతారామం ఒప్పుకుంటూ తల ఊపాడు.

"ఇంక వస్తూనే ఉంటావేమోలే" గోపాలం అర్థవంతంగా నవ్వాడు! సీతారామం ప్రశ్నార్థకంగా ఒక క్షణం మొగం చిట్లించి వెంటనే గ్రహించి తనూ నవ్వాడు.

"నిజంగా అదేం జరగదురా. ఇదే ఆఖరుసారేమో......నువ్వెప్పుడైనా రమ్మంటే తప్ప".

"ఏం? పిల్ల నచ్చలేదూ ?"

"నే నింకోలా చెపుతాను. నాకో ఆదర్శం ఉంది. అల్లా ఉండాలి పిల్ల."

"ఏమోయ్ ? ఈ పిల్లకేం. నేను చిన్నప్పటి నించీ ఎరుగుదును. మా ఆవిడకి చాలా స్నేహం, బంగారపు బొమ్మలా ఉంటుంది."

"అదే నా కక్కర్లేదు. నాకు పిల్ల నల్లగా ఉండాలి.........అంటే అదో మోస్తరుగా మాయగా"—

అత నింకా వర్ణనకోసం మాటలు వెతుక్కుంటున్నాడు. గోపాలం పకపక నవ్వాడు.

"మనబోటి కవిగాళ్ళం చాలా చిత్రమైన జంతువులంరా" అన్నాడు గోపాలం.

ఇద్దరూ కాలవగట్టు వాలులో పచ్చికమీద కూర్చున్నారు. ఒక పదిగజాల దూరంలో ఒక పంట కాలవ చీలిపోతోంది. నిరంతరంగా, శ్రుతిలాగ వినబడే ఆ చిన్న జలపాతం విన్నకొద్దీ వినాలని ఉంది. సూర్యుడు అస్తమించాడు. నీలి పొగలాగ దిక్కుల పొలిమేరల్లో చీకటి చెట్ల వరసని ఆక్రమించుకుంటోంది. సీతారామం నెమ్మదిగా చుట్టపొగ వదులుతున్నాడు. చటుక్కుని ఉత్సాహంతో లేచి కూర్చున్నాడు.

"నే నెవరితోటీ చెప్పదలచుకోనికథ ఒకటినీకు చెపుతానురా."

గోపాలం కూడా లేచి కూర్చున్నాడు.

"పెళ్ళికూతుళ్ళని గురించేనా ?"

"అవును, కాదు. కాని ఒక సంగతి చెప్పగలను. మానాన్న బలవంతంకొద్దీ మొదట బయలుదేరాను. ఏమయితేనేం, నేను చూసినంతమంది పెళ్ళికూతుళ్ళని ఎవళ్ళూ చూసి ఉండరు. నాకు నిజంగా నచ్చడమంటే ఏమిటో నచ్చక పోవడమంటే ఏమిటో తెలియటం లేదు. అసలు ఆడపిల్లని కాలేజీల్లో కాదు చూడవలిసింది. మన ఆడజాతి అసలు ఎక్కడుందీ అంటే నేను యింత వరకూ చూసిన ఆడపిల్లల్లో ఉంది. ప్రతి కుర్రవాడూ, పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం ఉండనీ లేకపోనీ, ఎంతమందిని వీలయితే అంతమంది పెళ్ళికూతుళ్ళనీ చూడాలి. చదువూ, కాలేజీ గదుల్లో ఆవరించిన సంఘ సంస్కారవాసనా, వీటిలోపడి నేననుకునే వాణ్ణి, ఇల్లా పెళ్ళికూతుళ్ళని ఏదో మార్కెట్టులో బొమ్మల్ని చూసినట్టు చూడ్డం ఆడ

జాతికి అపచారమని. అబ్బాయి! నేనొకటి చెప్పుతాను, పరస్పర ప్రేమ, స్వాతంత్ర్యం అన్నీ పట్టి కోతలు. బెర్నార్డ్‌షా చెప్పినట్టు ఆడవాళ్ళ పేర్లూ మగవాళ్ళ పేర్లూ చీట్ల మీద వ్రాసి ఏవో చేతికి వచ్చిన రెండేసి పేర్లకి పెళ్ళిళ్లు చేసేసినా, ఇప్పుడున్న దుఃఖం, మనస్సు కలవకపోడంకంటె ఎక్కువ ప్రమాదం ఏమీ రాదు. పెళ్ళి చేసుకో, మానెయ్యి, కాని పెళ్లి కూతుళ్ళని మాత్రం ఎంత మందిని పడితే అంతమందిని చూడు, అదే ఒక సంస్కారం :

గోపాలం ఆదరంగా అతన్ని చూసినవ్వాడు. సీతారామం ఇంకో చుట్ట అంటించి మళ్ళీ మొదలు పెట్టాడు.

"నేను చాలా ఆలోచించాను ఆదర్శ సుందరి ఎల్లా ఉంటుందీ అని. ఆదర్శం మనకి దొరికేదా? దొరకనిదా? మనకి దొరకనిదయితే మనకెందుకు దాని సంగతి? దొరికేదయితే దాన్ని గురించి అంత ఆ వేదన ఎందుకు? సరేలే కథ చెపుతాను విను."

ఒక పడవ మెల్లగా జారి వెళ్లింది. వాళ్ళ ముందు నుంచి. ఒక కళాసు చినిగిన తాటాకు చేదతో కాలవలోంచి నీళ్లుతోడుకుంటున్నాడు. టాపుమీద ఎవరో "హరిహరీ నారాయో" పాడుతున్నారు. గుప్పుని కళాసులు వండుకునే చేపల కూర వాసన కొట్టింది. పడవ జారి పోయింది. చిన్నచిన్న నీటి కెరటాలు ప్రాణమున్న జంతువుల్లాగ కొద్దిగా మెరుస్తో గట్టుదాకావచ్చి చచ్చిపోతున్నాయి. సీతారామం కథ ప్రారంభించాడు.

"నెల్లాళ్ళ క్రితం నేను కొవ్వూరు వెళ్లాను. సాయంకాలం ఒంటరిగా గోదావరి గట్టువెంబడి రైలువంతెన వేపు నడిచి వెళ్లాను. గట్టు ఏటువాలులో తుమ్మచెట్లు ఎన్నో యుగాలుగా తపస్సు జేస్తున్నట్టు నిలబడి ఉన్నాయి. అడుగు ఎత్తు తంగేడు మొక్కలు పచ్చగా పూసి ఒత్తుగా అల్లుకుపోయి ఉన్నాయి. కుడిపక్క పెద్దవాలులో అడుగుని పచ్చిక మేస్తున్నాయి కొన్ని దూడలు. సన్నని రైలు పట్టాలమీద ఇసుక తీసుగుపోయే ట్రక్కులమీద ఎక్కి రంయిమని వాలుకి వదులుతున్నారు పిల్లలు. రైలుగట్టు కింద స్టేషను వేపు దూరంగా ఫుట్‌బాల్ ఆడుతున్నారు కొందరు. వంతెన కిందకి వచ్చాను. నా కింద లోతుగా ఒక లోకం, మధ్య నేను నాపైని ఎత్తున ఇంకో లోకం. మనిషినీ, నాగరకతనీ మరపించే మార్పులేని వాతావరణం ఏదో అక్కడ ఆవరించుకుని ఉంటుంది. ఎప్పుడయినా సరే అక్కడికి వెళ్ళు. ఇంకో యుగంలోకి పోయినట్టు ఉంటుంది. కిందలోతుని చిన్న రెల్లు దుబ్బులు, ఇంకా లోతుని దూరంగా ఇసిక తిన్నెలు, గోదావరి, పెద్ద రైలుగట్టు, పెద్ద ఇనప దూలాలు మోస్తున్న రైలు వంతెనా, ఒక్కొక్క చిన్న చప్పుడు, అంత పెద్ద గట్టుమీద ఎక్కడో ఒక మనిషి గాలివంతెనలో నిలిచి బొంయిమని దూసుకుపోతూ ఉంటుంది.

"నేను కాలిదారి వెంటనే గోదావరి వేపు దిగాను. పరుచుకొన్న పాములాగ ఎత్తు పల్లాల మీంచి పొడుగ్గా సాగిపోయింది కాలిదారి. ఎదురుగా ఒక కూలిమనిషి కుండతో నెత్తిమీద నీళ్లు మోస్తూ, నన్ను తప్పుకు పోయింది. వరకంగా ఉన్న రెండో వాలు దిగాను. కాలిజోడు జారి కొంచెం గుండెల్లో జల్లుమంది. మళ్లీ యింక ఎక్కి వెళ్ళలేని పాతాళ లోకంలోకి పడిపోయిన నిస్పృహ ఒక రెప్పపాటు సేపు ఆవరించింది. కను మేరవరకూ ఆవరించిన యిసుక తిన్నె మీద నడచి వెడుతున్నాను. గాలి చిరు చలిగా ఉంది. స్వచ్ఛమైన నీరు ఇసుక అంచుమీద జర్రుని పాకుతోంది. నీటి అంచుని చలిగా ఉన్నట్టు అనిపించి రెల్లు దుబ్బులవేపు లోపలికి నడిచి వెళ్ళాను. కండువా తిన్నెమీద పరచి కుడిచేతిమీద తల ఆన్చి పక్కవాలుగా పడుకున్నాను. ఎదురుగా రాజమండ్రి ఇళ్ళపైని ఎర్రని సంజకావి అప్పుడే ఆరిపోయింది. ఏమీ ఆలోచన లేకుండానే ఆలోచిస్తున్నాను. అంత పెద్ద ప్రకృతి మధ్య ఇంక ఆలోచనలు తట్టవు. వాటి మధ్య ఉన్న జ్ఞానం ఒక్కటే ఒక పెద్ద ఆలోచన. ఆ నీరూ, ఆ గాలీ, ఆ వంతెనా, ఆ రెల్లు దుబ్బుల వరసా, వాటితోనే జ్ఞానేంద్రియములు నిండిపోతాయి. "వయ్యారి నా సిలకా!" అని పాట ఒకటి చటుక్కుని వినబడింది. కీచుగా నిర్లక్ష్యంగా ఉంది గొంతు. నన్ను చూసి గావును చటుక్కున పాట ఆగిపోయింది. ఆగి

పోవడం నేను గుర్తించి లేచి పక్కకి చూశాను. ఆమె ఎవరో నాకు తెలియలేదు. చీర మోకాళ్ళ పైకి బిగించి కట్టింది. పయట గుత్తంగా ముందు నించి దోపింది. గాలికి ఆమె జుట్టు చెదిరి ఎగురుతోంది. వయస్సు యిరవై సంవత్సరాలు ఉండొచ్చు. నేను మళ్ళీ పక్కమీద ఆనుకొని పడుకున్నాను. కొంతసేపు తటపటాయించి ఆమె కూడా అక్కడే కూర్చుంది. ఆమె యింక పోడలేదు. నేను మాట్లాడలేదు.

"చీకటి పడుతోంది. నేను లేచి కండువా దులుపుకున్నాను. రెండడుగులు ఒళ్లు విరుచుకుంటూ లేచాను.

"బాబు గారికి సీకటయిందా" అంది ఆమె చటుక్కని, నేను అదిరి పడ్డాను. నా గుండెలు కొట్టుకున్నాయి.

"నువ్వెవరు ?" అన్నాను.

"బాబు గారికి సీకటయితే భయమా!" అంది మళ్ళీ. ఆమె నాముఖంలోకి నవ్వుతూ చూసింది.

"నువ్వెవరు ?"

"కూలీలం. ఏటి గట్టావల గుడిసెలో ఉంటాం!

"నీకేం కావాలి?" ఆమె లేచి నిలబడింది. ఆమె వేపు తీక్షణంగా చూశాను. మట్టిలాగ నిగనిగ లేని నల్లరంగు—ఆ కను చీకటిలో మాయగా కనబడింది. ఆదరమూ తిరస్కారము లేని ఆమెచూపులు ఆకాశంలాఆవలించుకు చూస్తున్నాయి. చెదిరిన కొప్పు ఆమె మళ్లీ ముడుచుకొంది.

"ఏం లేదు. పెందలకడే ఎల్లిపోతుంటే అన్నాను."

"నేను ఊళ్ళోకి పోవాలి ......మాదీ పూరుగాదు." నా గొంతులో కొంత చిరాకుంది. మోగింది. అందుకు నేనే అసహ్యించుకొన్నాను

మీ రియ్యాలే వొచ్చారు. నాను రోజూ సూతుంటాను వొచ్చేపొయ్యే వోళ్ళని"

"నువ్వేం చేస్తూ ఉంటావు ?"

"పాప్పాను కాదండీ కూలీలమని" ఆమె గొంతులో ఏ సూచనా లేదు. ఎంతో స్వాభావికంగా మాట్లాడింది.

"వచ్చే పొయ్యేవాళ్లందరితో నీకేం పని ?"

"సూతమే." ఆ మాటలో ఆఖరి సమాధానం యిమిడి ఉంది. నాకు కుతూహలమో, కుర్ర తనమో ఆవరించింది.

"తప్పు కాదూ అల్లా అందర్నీ పలకరిస్తే?"

"ఏంతప్పూ ?"

"వాళ్ళు ఏమన్నా అనుకోరూ ? నువ్విలా పలకరిస్తే ?"

"ఏమనుకుంటారు ?"

"నువ్వు చెడిపోయిన మనిషివని......ఇల్లా చూడు......ఎవరయినా......ఎవ్" తరువాత వాక్యం నాకు తోచలేదు.

"అనుకుంటే నాకేం" ఆమె నిర్లక్ష్యంగానూ అనలేదు, కోపంగానూ అనలేదు. నేను హఠాత్తుగా ధైర్యంగా అన్నాను..

"నీమీద ఎవరయినా చెయ్యివేస్తే ఏంజేస్తావు?"

ఏసి సూత్తే తెలుత్తాది"......ఆమె ధీమాగా అంది ఆ ముక్క. తరువాత మెల్లిగా గొంతుకలో అంది, అయినా నాకిట్టమయితే......"



"అంగూరీ" అనే హిందీ చిత్రంలో నటిస్తున్న తార — కౌశల్య.

"నేను ఇసుకలో దిగబడి పోయి నిలబడ్డానుఒక క్షణం. కను చీకటి చిక్కబడింది. ఆమె రెల్లు దుబ్బుల మాటుకి దారి తీసింది. నేను కూడా వెళ్ళాను. అంతా మేమిద్దరం ఒప్పుకున్నట్టే జరిగి పోయింది నీరు తగిలితే విడిపోయే బెల్లులు విరిగిన పెద్ద పొలం లాగ, ఉంది ఆమె. ఆమె మాటల్లో ఆమె శరీరంలో ఆమె చేతులలో అతి ప్రాకృతికమయిన దేదో ఉంది—ఆమె గోదావరిలోలాగ, ఆవంతెనలో లాగ, ఆకాశంలో లాగ ఆమె మాటల వెనక అతి నిశ్శబ్దమయిన అర్థం

తెలియని కదలిక ఉంది. ఆమెకు నాగరికత తెలియదు— తెలుసునేమో నాకు తెలియదు. కాని నవీనత ఎన్నడూ మార్చలేని దార్ఢ్యం ఆమెది. ఆమె శరీరం చుట్టూ అద్భుతమైన వాన కురిసిన మట్టి వాసన మత్తుగా వ్యాపించి ఉంది. ఆమె పచ్చని సారవా చేను లాగ బద్ధకంగా నిబద్ధకంగా అల్లా పడుకుంటే ఆమె కళ్ళలో ఆకాశం ప్రతిఫలించింది. అల్లా ఎంతసేపు.....

"నేను ఊళ్ళోకి పోయే ప్రయత్నంమీద లేచాను. ఆమెకూడా లేచింది. నేను జేబులోంచి రూపాయి తీసి ఆమె కిచ్చాను. ఆమె కొంతసేపు నాకేసి చూసి తీసుకుంది.

"నీకిది వృత్తా?" అని అడిగాను.

"కాదు" ఆమె పెద్ద చిరునవ్వుతో ముఖం విచ్చింది. "నీ మొగుడున్నాడా?"

"ఆఁ"

"పిల్లలు?"

"నలుగురు"

"నన్ను ఎవరో మొత్తినట్టు అనిపించింది. కంగారుగా ఆమె వేపు చూశాను. అమె సంతృప్తిగా కొప్పు పెట్టుకుంటోంది.

"నీ మొగుడికి తెల్తిస్తే ఊరుకుంటాడా?"

"ఆడికి తెలదు. తెల్సినా మాత్రం?"

"ఇల్లా తరుచు అవుతో ఉంటుందా?"

"ఎప్పుడో నూటికో కోటికి ఒకోనాడు...... అలా గనిపి తది. ఇది మూడోతూరి — ఆ పయిని మీ రెవరో నే నెవరో...,...ఈయాల కూలిపని లేదు. ఊసుపోక ఇల్లా వచ్చాను. మద్దేనం నించీ అల్లా గల్లాగ తిరిగాను, ఓ గడియ సుకంగుంటే ఆపయిని మీరెవరో నేనెవరో......రోజూ ఈ పొద్దు ఈ తిప్పంతా తిరుగుతాం మావోడు నేనూ, ఆడీయ్యాల పనిమీద పోయాడు!

"డబ్బుచ్చుకుని ఈ పనికి ఒప్పుకునే వాళ్ళుంటారు తెలుసా?"

"ఆ!"

"మరి నువ్వు డబ్బుచ్చుకున్నావు?"

"మీరు కలిగినోరు, మేం కూలోళ్ళం. ఉ తనే ఇచ్చినా పుచ్చుకుంటాం" ఆమె నాచేతికి రూపాయిని తిరిగి ఇచ్చి వెయ్యబోలేదు. ఆమె ఎందుకు తీసుకుందో ఆ విషయమయి అనుమానం లేకుండా నిర్ధారణ అయిపోయినట్టు ఆమె మాట్లాడింది. ఆమె నాకు నచ్చ చెప్పలేదు. నేనదంతా ఒప్పుకున్నట్టే సంతృప్తిగా ఆమె వెళ్లిపోయింది.....

"ఆమె శుద్ధ దొంగని నానమ్మకం. నిన్ను టోకరా కొట్టించింది రూపాయికోసం" అన్నాడు కొంటెగా గోపాలం. సీతారామం చుట్ట అవతల పారేశాడు. తాపీగా అన్నాడు.

"ఏమో! అయితే కావచ్చు. నే చెప్పేది అది కాదు. ఆమె మామూలు మనిషే అయినా, ఆ ముహూర్తంలో, ఆ వాతావరణంలో కనబడ్డ ఆ మూర్తి మళ్లీ నాకు కనబడదు. తరవాత లక్ష సార్లు ఆమె నా కంటపడి ఉండవచ్చును. కాని ఆ రాత్రి నేను చూసిన ఆ మూర్తి మళ్లీ నాకు కనపడదు. ఆ కళ్లు, ఆ నల్లరంగు, రంగులేని ఎన్నో పొరలు కమ్మినందువల్ల నల్లగా కనబడే ఆ రంగు,అదీ నేను ఆదర్శమనేది. ఆమె ఈ క్షణాన్ని అవతలి గట్టుమీద అల్లా నడిచిపోతుండవచ్చు. ఆమనిషి కాదు నేననేది... నే ననేది నీకు తెలిసిందో లేదో."

"ఆ' తెలిసింది. అందుకే ఇంతమంది ఆడపిల్లల్ని చూస్తున్నా నంటావు. రంగుకాని నల్ల రంగు దొరికేదాకా వెతుకుతా నంటావు. అదే ఒక సంస్కారమంటావు. అంతా బాగానే ఉంది గాని, నా సలహా ఒకటుంది. మీ వాళ్లందరికీ ఏ పిల్ల నచ్చితే ఆ పిల్లని ముందు పెళ్లి చేసుకో, లేకపోతే నువ్వు చెప్పినలాంటి ఆదర్శాలు ఏ చీకటి మాటునో రోజూ కనబడుతూనే ఉంటాయి. నీ ఇల్లూ వొళ్లూకూడా ధ్వంస మవుతాయి."

"ఫరవా లేదురా.........ఆదర్శం ఒకటే. రోజూ కనబడదు." సీతారామం తన ఆదర్శం లోపలికి ముడుచుకు పోయాడు. ఇతరులంతా చులకనచేసే ఆ ఆదర్శం అతనికి మాత్రం అద్భుతంగా ఉంది. అతడు దాన్ని గురించి ఎవరితోనూ వాదించ దలుచుకోలేదు. అతడు ముఖం కళ్లు తీక్ష్ణంగాచేసి చీకట్లోకి చూస్తో అన్నాడు.

"ఆ పయిని నేనిప్పుడు నీకు చెప్పిందంతా నిజమని అనుకో నక్కరలేదు.....అదొక కల."

ఆకర్షణీయమైన రచనలకు ఆనందవాణి